క్లుప్తంగా

వేలాడుతున్న కేబుల్ వైర్లను తక్షణం తొలగించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్, కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రజలకు ప్రమాదకరంగా, అసౌకర్యంగా మారుతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇటీవల ఈ సమస్యపై వీఎంసీ సిటీప్లానర్, ఇతర అధికారులు, కేబుల్ ఆపరేటర్లు, నెట్ ఆపరేటర్లతో కూడా సమావేశం నిర్వహించామని, కానీ ఆ సమావేశానికి కొంతమంది మాత్రమే ఆపరేటర్లు వచ్చారన్నారు. మూడు రోజుల్లోగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కేబుల్ వైర్లను తొలగించాని, లేకుంటే వీఎంసీ నోటీసులు ఇవ్వకుండా వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగిస్తుందని స్పష్టం చేశారు.

హెచ్ఐవీపై జానపద కళాజాత



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణి గారితోటలోని వైట్‌హౌస్ సెంటర్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై జానపద కళాజాత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటిక కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్లు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, బ్లడ్ బ్యాంక్‌లు అందించే సేవలు, రక్తదానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక యూపీహెచ్‌సీ డాక్టర్ బి.సందీప్, ఆర్‌పీపీ గోవర్ధన్, గైడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బాండీ స్కేటింగ్‌లో క్రీడాకారుల సత్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ): బాండీ (ఐస్ బాల్ హాకీ) పోటీలో విజయవాడ భవానీపురానికి చెందిన బిగ్ చాంపియన్ స్కేటింగ్ అకాడమీ స్కేటింగ్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 10 మెడల్స్ సాధించారు. ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలో 9 రాష్ట్రాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 20 మెడల్స్ రాగా.. వాటిలో భవానీపురం బిగ్ చాంపియన్ స్కేటింగ్ అకాడమీ నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో కుందనిక బొల్లు, వేద శ్రీ, సునైన, దాక్షిణ్య, ఆఫ్రిన్ (అండర్ 10) సిల్వర్ మెడల్స్ సాధించారు. అదే విధంగా పర్ణం కష్వి, శ్రీవల్లి, అభిజ్ఞ, దైత్య, శరణ్య (అండర్ 12) బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు అకాడమీ కోచ్ ఖాదర్ బాషా ఓ ప్రకటనలో వివరించారు. రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో 10 మెడల్స్ సాధించటం అకాడమీకి గర్వకారణమని ఆయన అన్నారు.

రైలు ఎక్కే క్రమంలో తప్పిపోయిన పిల్లలు

రెండు గంటల్లోనే కేసును ఛేదించిన జీఆర్‌పీ



తప్పిపోయిన పిల్లలను తల్లికి అప్పగిస్తున్న జీఆర్‌పీ సీఐ జె.వి రమణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్‌లో ఇద్దరు పిల్లలు తప్పిపోయినట్లు వచ్చిన ఫిర్యాదుపై విజయవాడ జీఆర్‌పీ సిబ్బంది స్పందించి కేవలం రెండు గంటల వ్యవధిలోనే వారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరులో నివాసముండే పెళ్లూరి చంటి అనే మహిళ తల్లి, ముగ్గురు పిల్లలతో కలసి అన్నవరం దేవస్థానం దర్శించుకుని అనంతరం నగరంలోని అమ్మవారిని దర్శించుకుని నెల్లూరు తిరుగు ప్రయాణం అయ్యేందుకు బుధవారం సాయంత్రం విజయవాడ రైల్వే స్టేషన్ చేరుకున్నారు. రైలు నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం పైకి వచ్చినట్లు తెలియడంతో వారంతా హడావుడిగా వెళ్లి రైలు ఎక్కారు. అనంతరం చూసుకుంటే వారిలో ఆరేళ్ల నాగ చైతన్య, తొమ్మిదేళ్ల నాగలక్ష్మి కనిపించలేదు. దీంతో వారు ఆరో నంబర్ ప్లాట్‌ఫాంలోని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది సీసీ టీవీల ద్వారా తప్పిపోయిన ఇద్దరు పిల్లలు ప్లాట్‌ఫారంలపై తిరుగుతున్నట్లు గుర్తించి వారిని సంరక్షించి ఆమె తల్లికి అప్పగించారు.

చినుకు పడితే చెరువే!

వన్‌టౌన్‌ను వెంటాడుతున్న ముంపు సమస్య

- చిన్న వర్షానికే జలమయమవుతున్న రోడ్లు
- డ్రెయిన్లలో సక్రమంగా పారని మురుగు
- అల్లాడుతున్న పాతబస్తీ ప్రజానీకం



గణపతిరావు రోడ్డులో నిలిచిన మురుగునీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చిన్నపాటి చినుకు పడితే వన్‌టౌన్ ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. పాతబస్తీలో ఏ వీధి చూసినా వర్షపునీటితో భారీ ప్రవాహం దర్శనమిస్తోంది. గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు భారీగా నిలిచిపోవటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. పాతబస్తీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే మార్గాలు సరిగా లేకపోవటంతో పరిస్థితులు ఎప్పటికప్పుడు దారుణంగా తయారవుతున్నాయి. వర్షం కురిసిన సమయంలో సరైన సిబ్బంది విధుల్లో లేకపోతే నీరు బయటకు వెళ్లటం కష్టమేనని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల అర్ధ రాత్రి కురిసిన వర్షంతో పాతబస్తీ మొత్తం పూర్తిగా మునిగిపోయింది. ఉదయం సిబ్బంది వస్తేగాని మురుగునీరు బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది.

డ్రెయిన్లలో చెత్తాచెదారం..

పాతబస్తీలో నివాసితులు చెత్తాచెదారం డ్రెయిన్లలో వేస్తుండటంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్తాచెదారం కోసం ఏర్పాటు చేసిన మెష్‌ల వల్ల మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దాంతో వాటిని తొలగించి నీటిని బయటకు పంపే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానిక ప్రజానీకం ప్రధానంగా ప్లాస్టిక్



వర్షపునీరు భారీగా నిలిచిపోవటంతో మెష్‌లు తొలగిస్తున్న సిబ్బంది

వ్యర్థాలు అత్యధికంగా డ్రెయిన్లలో విచ్చలవిడిగా వేస్తుండటంతో మురుగునీరు బయటకు వెళ్లేందుకు సమయం పడుతోంది. కొన్ని సమయాల్లో చెత్తాచెదారం అడ్డుపడి మురుగునీరు బయటకు వెళ్లటానికి అవకాశం లేకుండా నిలిచిపోతోంది. ముఖ్యంగా సుబ్బరామయ్యవీధి, గణపతిరావురోడ్డు, కుమ్మరి వీధులు, గులాంమొహిద్దీన్ వీధి, వించిపేట తదితర ప్రాంతాల్లో నుంచి వచ్చే డ్రెయిన్లలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తుండటంతో తరచూ నీరు నిలిచి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది.

అస్తవ్యస్త నిర్వహణ..

నగరపాలకసంస్థ అధికారులు అస్తవ్యస్త నిర్వహణతో పరిస్థితులు దారుణంగా తయారవుతున్నాయి. డ్రెయిన్లలో పూడిక తొలగింపులో సరైన పర్యవేక్షణ లేకపోవటంతో ఎప్పటికప్పుడు పరిస్థితులు దిగజారుతున్నాయి. ప్రధానంగా వర్షం పడి రోడ్లు మునిగినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారు మినహా సాధారణ రోజుల్లో వాటి నిర్వహణను పూర్తిగా పక్కన పెడుతున్నారు. దాంతో వర్షం పడిన ప్రతి సారి పాతబస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మురుగునీరు సజావుగా బయటకు వెళ్లేందుకు అవసరమైన నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు



షో రూంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వీఎంసీ ఫైర్ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): వ్యాపార సముదాయాల్లో పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, తమ తోటి వారి ప్రాణాలను ఎలా కాపాడాలనే అంశాలపై అవగాహన ఉండాలిన రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం వీఎంసీ ఫైర్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని లక్కీ షాపింగ్‌మాల్స్‌లో అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలనే అంశంపై షోరూంలో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వల్ల స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఒక దేశం ఒకే ఎన్నిక’పై అవగాహన



సమావేశానికి హాజరైన ఇగ్నో అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) కేంద్ర కార్యాలయంలో బుధవారం ‘ఒక దేశం ఒకే ఎన్నిక’ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం యువతను ఎంతగానో ఆలోచింపజేసిందని విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 57 ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాలతో పాటు విజయవాడ ప్రాంతీయ కేంద్రాలయంలోనూ ప్రత్యేక అభ్యాస మాధ్యమాల ద్వారా సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణ వికాస రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుందని శర్మ తెలిపారు. లోక్‌సభ, విధాన సభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ ఎంతో లాభదాయకమని మంత్రి వివరించారన్నారు. కార్యక్రమంలో ఇగ్నో ప్రాంతీయ కేంద్రాల నుంచి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె. సుమలత, డాక్టర్ పి. శరత్ చంద్ర, డెప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ బాలచందర్ ఇతర అధికారులు సిబ్బందితో పాటు స్థానిక ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి నిత్యావసరాలు అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొంతు, నాలుక క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి తిరుపతి వెంకట రత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ పక్షాన సాయం అందజేశారు. విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రోటరీనగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ శివ గత కొంత కాలం క్రితం టంగ్, గొంతు క్యాన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయన ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం ట్రస్ట్ నిర్వాహకుల దృష్టికి రావడంతో చైర్మన్ తిరుపతి అనూష బుధవారం శివ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబానికి అవసరమైన పచారి సరుకులు, బియ్యం, పండ్లు అందజేశారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న బాధితుడి ఇద్దరు పిల్లల స్కూల్ ఫీజులు తామే చెల్లిస్తామని భరోసానిచ్చారు. బొమ్ము గోవిందలక్ష్మి, ఎం. రాజేష్, కార్తీక్, దాసి రామమోహన్, కె. వినోద్‌కుమార్, తిరుమరెడ్డి గణేష్, మణికంఠ పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయవాడలీగల్: ఉద్దేశ పూర్వకంగా చీటింగ్ చేసిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ రెండో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నెట్టం రాధిక తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఫిర్యాదిదారు కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో మెట్లబజార్ ప్రాంతంలో తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఫిర్యాదిదారు, అతని తల్లికి అవసరాల నిమిత్తం కృష్ణలంక ఎస్‌బీఐ బ్యాంకు, భాస్కరరావు పేట బ్రాంచ్ నందు తన అకౌంట్ నుంచి అతని తల్లి అకౌంట్‌కు రూ.3 లక్షలను వేసే సమయంలో అకౌంట్ నంబర్ చివరి అంకె తప్పుగా వేశారు. దాంతో డబ్బులు అతని తల్లి అకౌంట్‌కు కాకుండా మచిలీపట్నం, నెలకుర్రు గ్రామానికి చెందిన భవిశెట్టి సురేంద్రబాబు అకౌంట్‌లో పడినట్లు తెలుసుకుని, సురేంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడగా డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా, తన బంగారపు వస్తువులను విడిపించుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత తాను ఇవ్వనని కరాఖండిగా చెప్పడంతో మోసపోయానని గ్రహించి, ఫిర్యాదిదారు కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 2017 మార్చి 5వ తేదీన భవిశెట్టి సురేంద్రబాబును అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నిందితుడైన భవిశెట్టి సురేంద్రబాబు (38)పై నేరం రుజువు కావడంతో బుధవారం న్యాయమూర్తి నెట్టం రాధిక నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా నుంచి బాధితుడికి రూ.9వేలు చెల్లించాలని ఆదేశించారు.

అధికార భాష అమలుపై సమీక్ష



సమావేశంలో టీఓఎల్ఐసీ చైర్మన్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ది టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టీఓఎల్ఐసీ) అర్ధ వార్షిక సమావేశం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్‌లో బుధవారం జరిగింది. టీఓఎల్ఐసీ చైర్మన్, బెంగళూర్‌లోని ఆర్‌బీఐ డెప్యూటీ డైరెక్టర్ (ఇంప్లిమెంటేషన్) అనిర్బన్ కుమార్ బిశ్వాస్ వివిధ బ్యాంకులు, బీమా కంపెనీలలో అధికార భాష అమలు తీరుపై సమీక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టీఓఎల్ఐసీ విజయవాడ చైర్మన్ సీవీఎన్ భాస్కరరావు రోజువారి విధుల్లో అధికార భాషను అమలు చేసేందుకు సులభమైన మార్గాల గురించి వివరించారు. టీఓఎల్ఐసీ జాతీయ స్థాయి బహుమతి పొందేందుకు అధికార భాష అమలుకు మరింత సహకారం అందించాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా గత 6 నెలల్లో అధికార భాషకు సంబంధించి నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో టీఓఎల్ఐసీ సభ్య కార్యదర్శి, అధికార భాష అధికారి పి. వివేక సుధ, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఇన్సూరెన్స్ కంపెనీల కార్యాలయ అధిపతులు, అధికార భాష అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన విజయవాడ డివిజన్ పనితీరు

డీఆర్‌యూసీసీ సమావేశంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులు, వినియోగదారులు, డీఆర్‌యూసీసీ సభ్యుల సహకారంతో గడచిన ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ అన్ని విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం డీఆర్ఎం కార్యాలయంలో 133వ డివిజనల్ రైల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సమావేశం జరిగింది. డీఆర్‌యూసీసీ చైర్మన్, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 13 మంది సభ్యులు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో డివిజన్ రూ.5,83.61 కోట్లు స్థూల ఆదాయం నమోదు చేసుకోగా.. అందులో సరుకు రవాణా ద్వారా రూ.4,239.74 కోట్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రైల్వేశాఖ నిర్దేశించిన 38.169 మెట్రిక్ టన్నులను అధిగమించి 38.322 మెట్రిక్ టన్నులను రవాణా చేయడం ద్వారా ఈ ఆదాయం సాధించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో డివిజన్‌లోని 21 స్టేషన్‌లలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని, నెల్లూరు, రాజమండ్రి స్టేషన్‌లో ప్రధాన అప్‌గ్రేడేషన్ పనులపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పి.ఈ ఎడ్విన్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, డీఆర్‌యూసీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో బుధవారం రైల్వే డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యను గుర్తు చేసుకుంటూ ఏటా మే 21న జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఉగ్రవాద వినాశకరమైన ప్రభావం గురించి అవగాహన కల్పించడం, ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలను కోల్పోయిన వారికి నివాళులర్పించడం, సమాజంలో శాంతి, సామరస్యం, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగుల చేత ఉగ్రవాద వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీపీఓ ప్రేమ్‌కుమార్ లకావత్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



చిట్టినగర్‌లో వేం చేసిన వేంకటేశ్వర స్వామి



ముస్తాబైన ఆలయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేం చేసిన పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 11వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను టీటీడీ వేద విశ్వ విద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్‌ల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

- 11వ తేదీ పౌర్ణమి బుధవారం ఉదయం స్వామి వారికి కలశాభిషేకం జరుగుతుంది. ముందుగా పవిత్ర కృష్ణానది నుంచి కలశాలతో జలాలను తీసుకుని ఆలయానికి చేరుకుంటారు. స్వామి వారికి అభిషేకాలు, అనంతరం పెళ్లి కుమారుడిగా అలంకరిస్తారు. ఇక సాయంత్రం విష్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తు హోమాలు, కంకణధారణ, గరుడ ఆరాధనలు జరుగుతాయి.
- 12వ తేదీ గురువారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, భేరీ పూజ, నవకుంభ స్థాపన, ధ్వజారోహణ, గరుడ ప్రసాదం పంపిణీ జరుగుతుంది. సాయంత్రం నిత్య హోమం, అష్టాక్షరీ హోమం, నవగ్రహ ఆరాధన, హోమం, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తారు.
- 13వ తేదీ శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 7 గంటల నుంచి శ్రీ వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపిస్తారు.
- 14వ తేదీ శనివారం స్వామి వారికి శ్రీ పుష్ప యాగం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారి నగరోత్సవం జరుగుతుంది.
- 15వ తేదీ శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, వసంతోత్సవం, అవభృతోత్సవం, చక్రస్థానం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహిస్తారు.

ఆలయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

దుర్గగుడి ఈవో శీనానాయక్



టికెట్ల విక్రయాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చేతి సంచులను వినియోగంలోకి తీసుకురావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, రావిచెట్టు వద్ద పూజ సామగ్రిని ఆయన పరిశీలించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో పెద్ద సంఖ్యలో ఖాళీ వాటర్ బాటిల్స్ ఉండటాన్ని గమనించి.. శానిటేషన్ సిబ్బంది క్యూలైన్లను శుభ్రం చేసే తరుణంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తొలగించాలని సూచించారు. అదే విధంగా అమ్మవారికి సమర్పించే పూజా సామగ్రిని సైతం భక్తులు ప్లాస్టిక్ కవర్లలో తీసుకువస్తున్నారని, కొండ దిగువన పూజా సామగ్రి విక్రయించే వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండపై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు భక్తులు, వ్యాపారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. దేవస్థానంలో తడిచెత్త, పొడి చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని గమనించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేవస్థానం భక్తులకు విక్రయిస్తున్న దర్శన టికెట్లను పరిశీలించారు.

చెప్పులను కౌంటర్‌లోనే భద్రపరుచుకోవాలి..

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో భక్తుల చెప్పులు కుప్పలు కుప్పలుగా పడి ఉండటంపై ఆలయ ఈవో శీనానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాల్లో చెప్పులను ఎక్కడ పడితే అక్కడ వదలకుండా మైక్‌లో ప్రచారం చేయాలని ఈవో పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డులోని చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్, క్లోక్‌రూమ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఇక సెల్‌ఫోన్ కౌంటర్, లగేజీ కౌంటర్‌లో అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లగేజీ రూమ్‌లో భక్తులతో మాట్లాడారు. ఓం టర్నింగ్ వద్ద ఉన్న కూల్‌డ్రింక్ పాయింట్, విజయ స్టాల్‌ను పరిశీలించి ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేసే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

దీక్ష విరమణలకు తరలివస్తున్న భక్తులు



దీక్ష విరమణలకు తరలివస్తున్న భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో స్వామి వారి దీక్ష విరమణలు కొనసాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు పీఠానికి తరలివచ్చి దీక్షలను విరమిస్తున్నారు. పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా భక్తులు ఇరుముడులను స్వామి వారిని సమర్పించారు. బుధవారం ఉదయం పీఠంలోని మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, యాగశాలలో హోమాలను నిర్వహించారు. పీఠం ఆవరణలో స్థాపిత దేవతారాధన, సుందరకాండ పారాయణతో పాటు సద్గురు సయ్యద్ అప్పలస్వామి వారి జయంతి వేడుకలను నిర్వహించారు. బుధవారం సాయంత్రం హనుమత్ దీక్షాపరులు, దుర్గాప్రసాద్ స్వామిజీ, భక్తజనులు పవిత్రకృష్ణానదికి చేరుకున్నారు. కలశాలతో నదీజలాలను తీసుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. హనుమత్ జయంతి, దీక్ష విరమణల నేపథ్యంలో పీఠంలోనూ, సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్ష విరమణలకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం తరపున అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ రాంపిళ్ల జయప్రకాష్, ఓం కార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా సెల్ఫ్ గ్రూమింగ్ (బ్యూటీషియన్ కోర్సు)లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. అందం అనేది కేవలం బాహ్య రూపానికి సంబంధించిన అంశం కాదని ఆత్మ విశ్వాసం, మనోభావాలు, సామాజిక సంబంధాలను కూడా అందం ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అందువల్ల మహిళలు అందంగా ఎలా తయారు కావాలనే విషయాలపై సెల్ఫ్ గ్రూమింగ్ కోర్సును నిర్వహిస్తున్నామని, నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని తెలియజేశారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతకు ఎటువంటి పద్ధతులు పాటించాలి, రోజు వారి జీవన విధానంలో ఎటువంటి సౌందర్య పోషకాలు, సాధనాలను ఉపయోగించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్న మహిళలు ఈ శిక్షణలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. 26వ తేదీ నుంచి తమ సంస్థ ఆవరణలోనే తరగతులు ప్రారంభం అవుతాయని, నామమాత్రపు ఫీజు చెల్లించాలని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న తమ సంస్థ కార్యాలయానికి పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలిసిందిగా కోరారు.

ప్రకటన

M/s. Shriram Finance Ltd, GOVERNORPET Branch, VJA [illegible]

TVN VASUDEVARAO, ADVOCATE